క్లుప్తంగా

యువకుల ఆపన్నహస్తం



బాధితులకు నిత్యావసర సరకులు అందజేసిన యువకులు

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురం, ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బుడగల పాప, సరిపల్లి అప్పారావుల గుడిసెలు వర్షాలకు కూలిపోయాయి. ఈ విషయం సోషల్ మీడియాలో తెలుసుకున్న గ్రామానికి చెందిన యువకులు మారిశెట్టి సత్తిబాబు, పుప్పాల శివబాబులు బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. నెల రోజులకు సరిపడే సరకులను ఏర్పాటు చేశారు. వాటిని గ్రామ నాయకుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో కోట అప్పారావు, తలారి శ్రీనివాసరావు, పుప్పాల సాయికృష్ణ, బుంగా బాలరాజు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.

13న నెక్ సెంటర్‌లో జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లో ఉన్న నెక్ సెంటర్‌లో ఈనెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు నెక్ జిల్లా అధికారి డి.హరి శేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 600 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బెల్, అపోలో ఫార్మసీ, డక్కన్ ఫైనాన్సు కెమికల్, ఎస్‌కే సేఫ్టీ వింగ్‌లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డీగ్రీ అర్హత కలిగిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు బయోడెటా, గుర్తింపు కార్డు, తమ సర్టిఫికెట్లతో ఆరోజు ఉదయం 10 గంటకు హాజరు కావాలన్నారు. జీతం రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94407 56250, 99491 56583 నవంబర్లకు సంప్రదించాలన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ రజనీ సూచించారు. మండలంలోని కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విజన్ ఆసుపత్రి వైద్యురాలు రజనీ 36 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి



అచ్చంపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

శంఖవరం: వరిలో తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లి, అచ్చంపేట గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకు ముడత పురుగు వరిపంటను ఆశిస్తే తాడు లేదా ముల్ల కంపతో లాగడం వలన లార్వాలు, గుడ్లు నీటిలో పడి చనిపోతాయన్నారు. ముడత పురుగు ఉన్న సమయంలో యూరియా వేయడం ఆపాలన్నారు. గట్లపై కలుపు ఉండకుండా చూడాలన్నారు. అనంతరం నీమాస్త్రం పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు క్రాంతి, శ్రావణి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓపెన్ యోగాలో డీఎస్‌ఏ క్రీడాకారుల ప్రతిభ



యోగా పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదిత్య సాయి యోగా సెంటర్, శివజ్యోతి యోగా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన బీకేఎస్ అయ్యంగార్ 8వ జాతీయ ఓపెన్ యోగా చాంపియన్‌షిప్‌లో కాకినాడ డీఎస్ఏ క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించినట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మంగళవారం తెలిపారు. బొజ్జా లక్ష్మీవెంకట సాయి ప్రథమస్థానం, ఎల్.సుచిస్మిత, కె.శ్రీనేత్ర ద్వితీయస్థానం, విశ్వనాథం యశ్మిత 5వ స్థానం, కె.అలేఖ్య, కె.గంగ ఇషాంత్ 6వ స్థానం, ఎం.అజిత్‌ఆదిత్య వర్మ కన్‌సోలేషన్ బహుమతులు అందుకున్నారన్నారు. వీరందరూ డీఎస్ఏ యోగా కోచ్ రాజు వద్ద శిక్షణ పొందుతున్నారు. పతాకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ పి.దొర, జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్ అభినందించారు.



పిఠాపురం మండలంలో ఏలేరు వరద ఉధృతి



గొల్లప్రోలు జాతీయ రహదారిపై ముంపులో వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు



గొల్లప్రోలులో నీటమునిగిన రహదారిపై విద్యార్థుల పాట్లు



గొల్లప్రోలులో పంట పొలాలను ముంచెత్తిన వరద నీరు

ఏలేరు.. కన్నీరు

- పిఠాపురం నియోజకవర్గాన్ని ముంచెత్తిన వరద
- ఉగ్రరూపం దాల్చిన ఏలేరు, సుద్దగెడ్డ నీట మునిగిన కాలనీలు, రోడ్లు
- గొల్లు మంటున్న గొల్లప్రోలువాసులు
- 216 జాతీయ రహదారిని ముంచెత్తిన వరద

పిఠాపురం: కనుచూపు మేరలో భూమి కనిపించడం లేదు. చెట్ల చివరలు తప్ప మొదళ్లు మాయమైపోయాయి. ఊరువాడా నీటితో ఏకమైన అంతా చెరువును తలపిస్తోంది. ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలు జలమయమయ్యాయి. చుట్టూనీరు తప్ప ఏమీ కనిపించక గొల్లప్రోలు గొల్లు మంటుండగా, పీకల్లోతు నీటిలో పిఠాపురం మండలం కొట్టుమిట్టాడుతోంది. ఏలేరు శివారు ప్రాంతమైన కొత్తపల్లి వరద ఉధృతికి కొట్టుకుపోతోంది.

వేల ఎకరాల్లో పంట నష్టం

వరద ప్రభావంతో నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాల వరి, 10 వేల ఎకరాల వాణిజ్య పంటలు నీటిలో తేలుతున్నాయి. ఇంకా రెండురోజుల పాటు వరద బీభత్సం కొనసాగనుండడంతో పంటలు పనికి రాకుండా పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోతట్టు కాలనీలు నీట మునిగి ఇళ్లల్లోకి నీరు చేరి స్థానికులు నరకం చూస్తున్నారు. గొల్లప్రోలులో ఈబీసీ కాలనీ, ఎస్సీపేట, సూరంపేటలతో పాటు లోతట్టు కాలనీలు అన్ని జలమయం కావడంతో స్థానికులు బయటకు వచ్చే మార్గాలు లేకుండా పోయాయి.



వాకతిప్పలో నీట మునిగిన వరిపొలం



సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ఉప్ప వారి సత్రం వద్ద చెరువుగా మారిన రోడ్డు

జాతీయ రహదారిని ముంచెత్తి..

గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద 216వ నంబర్ జాతీయ రహదారిని వరద నీరు ముంచెత్తడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో రహదారి వెంబడి గస్తీ నిర్వహిస్తూ ప్రయాణికులను దగ్గర ఉండి వరద దాటిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా వహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. మంగళవారం రాత్రికి మరింత వరద నీరు వచ్చే అవకాశం ఉండడంతో గొల్లప్రోలు, పిఠాపురం మండలాలు మరింత నీట మునిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పిఠాపురం మండలంలో...

పిఠాపురం మండలంలోని విరవాడ, విరవ, మంగితుర్తి, కోలంక, ప్రత్తిపాడు, భోగాపురం, రాయవరం, రాపర్తి తదితర గ్రామాలు నీట మునగాయి. గొల్లప్రోలు మండలంలోని గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు తాటిపర్తి, చెందుర్తి, వన్నెపూడి, చేబ్రోలు తదితర గ్రామాలు వరద నీటిలో మునిగిపోయాయి. గొల్లప్రోలులో పాఠశాలలు వరద నీటిలో మునిగిపోవడంతో విద్యార్థులు అష్టకష్టాలపై తరగతులకు హాజరయ్యారు. కాగా మంగళవారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో తల్లిదండ్రులు వచ్చి వారిని ఇళ్లకు తీసుకెళ్లాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.



రాపర్తి రోడ్డును ముంచెత్తిన వరద (ఏరియల్ వ్యూ)

కొత్తపల్లి మండలంలో...

కొత్తపల్లి: ఏలేరు ప్రాజెక్ట్‌లోని అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో కొత్తపల్లి మండలాన్ని వరద నీరు ముంచెత్తింది. పలు గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ముంపుపై అధికారులు అప్రమత్తమయ్యారు. ముంపు ప్రాంతాలైన నాగులాపల్లి, ఇసుకపల్లి, రమణక్కపేట గ్రామాల్లో మంగళవారం అధికారులు పర్యటించారు. కాలువలకు పడిన గండ్లును పూడ్చి వేయించారు. నాగులాపలి ఎస్సీపేటకు వరద ముప్పు ఉండటంతో అక్కడ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో సుమారుగా 100 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైనట్టు మండల వ్యవసాయాధికారి జోగిరాజు తెలిపారు.

చెరువుగా మారిన పిఠాపురం రోడ్డు

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డు చెరువుగా మారింది. సోమవారం రాత్రి ఏలేరు కాలువ ఉధృతి పెరగడంతో మంగళవారం ఏలేరు కాలువ నీరు ఉప్పువారి సత్రం వద్ద రోడ్లపైకి చేరింది. దాంతో ఆ ప్రాంతంలోని టిడ్కో గృహ సముదాయం, పొలాలు నీట మునిగాయి. వర్షాలకు రోడ్డులో గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక చిన్న వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యారు. ఎస్సై మూర్తి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి పరిస్థితిని గమనించే విధంగా వీఆర్వోలను నియమించారు. ఉప్పువారి సత్రం వద్ద ఉన్న ఏలేరు కాలువ లాకుల వద్ద నీరు మండల పరిధిలోని చంద్రంపాలెం, నవర గ్రామాలలోని ఏలేరులోనికి చేరింది. లాకుల నుంచి ఏలేరు నీరు వీకే రాయపురం మీదుగా సముద్రంలోనికి చేరింది. గత రెండు రోజులుగా వర్షాలు లేక పోయినా ఏలేరు ప్రాజెక్టు వరద నీటిని భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు ఎమ్మెల్యే రాజప్ప ఏలేరు కాలువ ఉధృతిని, ఉప్పువారి సత్రంలో పిఠాపురం రోడ్డును పరిశీలించారు. తుపాను వలన నష్టపోయిన వారందరిని ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతో పాటు టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.



గొల్లప్రోలులో వరద నీటిలో వృద్ధుడి కష్టాలు

వరదలో చిక్కుకున్న యువకులు

పిఠాపురం: సరదాగా వరదలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు ముగ్గురు యువకులు. స్థానికుల కథనం ప్రకారం పిఠాపురం మండలం రాపర్తికి చెందిన తొమ్మిది మంది యువకులు సరదాగా వరద చూసేందుకు గ్రామ శివారు ఏలేరు కాలువ వద్దకు వెళ్లారు. వరద ఉధృతి అధికంగా ఉన్నా ఏమాత్రం లెక్క చేయకుండా నిర్లక్ష్యంగా ఏలేరు కాలువ గట్టుపై నడుచుకుంటూ ముందుకు వెళ్లిపోయారు. తిరిగి వెనక్కి వచ్చేందుకు ప్రయత్నించగా కాలువ గట్టు కోతకు గురై దారి లేకుండా పోయింది. దీంతో ఆరుగురు యువకులు మరో వైపు గట్టుపై పిఠాపురం మండలం జములపల్లి వైపు వెళ్లి వరద నీటిలో ఉండి పోగా పోలీసులు సమాచారం అందుకుని వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. మిగిలిన ముగ్గురు ఎస్.శివ, బి.దుర్గాప్రసాద్, బి.శివ కాలువ గట్టు దిగి పంట పొలాల్లో ఒడ్డుకు చేరేందుకు ప్రయత్నించి వరదలో చిక్కుకున్నారు. దీంతో అక్కడి చేరిన స్థానికులు వారికి మార్గం చూపిస్తూ వరద నీటిలోంచి బయటకు వచ్చేలా చేయడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు.




వరదలో చిక్కుకున్న యువకులు



గొల్లప్రోలు బల్లకట్టు వద్ద నీట మునిగిన వేరుశనగ మిల్లులు



నాగులాపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ



గొల్లప్రోలు మండలంలో చెరువును తలపిస్తున్న వరిపొలాలు



గొల్లప్రోలు సూరంపేటలో ఇళ్లను ముంచెత్తిన వరద

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



సామర్లకోటలో టిడ్కో సముదాయంలోకి వచ్చిన వరదను పరిశీలించిన ఆర్డీఓ కిషోర్



వీకే రాయపురంలో ఏలేరు కాలువ గట్టు గండిని పరిశీలించిన ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

ఏలేరు కాలువ గట్టును పరిశీలించిన ఎమ్మెల్యే

సామర్లకోట: వీకే రాయపురం గ్రామంలో ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గ్రామంలో ఏలేరు కాలువ గట్టు కోతకు గురి కావడంతో చేపట్టిన మరమ్మతు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఏలేరు కాలువ గట్టు కోతను గమనించి, వెంటనే చర్యలు చేపట్టిన అధికారులను అభినందించారు. గండిని వేగంగా పూడ్చేలా చూడాలని ఎంపీడీఓ డి.శ్రీలలితకు సూచించారు. వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల ప్రజలు, రైతుల సమస్య పరిష్కారమయ్యేలా కాలువపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, గ్రామ సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణ స్వామి, రైతు సంఘ నాయకులు కుర్రా శ్రీనివాసరావు, గొలపల్లి నానాజీ, నిమ్మకాయల రంగనాగ్, పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన

స్థానిక పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం ఎదురుగా ఉన్న టిడ్కో గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ మేరకు ముంపు బాధితులకు బియ్యం, కూరగాయలు, పప్పులు పంపిణీ చేశారు. అదే విధంగా కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ టిడ్కో గృహాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, వీఆర్వోలు మురళీ, వల్లీ, జయ, ఎస్.లోవరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలల్లో కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధం

- పెద్దాపురం మండలాన్ని చుట్టేసిన ఏలేరు వరద
- ముంపులో పది గ్రామాలు, 2,300 ఎకరాల పంట

పెద్దాపురం: ఏలేరు కాలువ పొంగిపొర్లుతోంది. కాలువ గట్లకు గండ్లు పడడంతో వరద నీరు పెద్దాపురం మండలాన్ని చుట్టేసింది. పది గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. సుమారు 2300 ఎకరాల పంటకు నష్టం వాటిల్లింది. తుపాను ప్రభావంతో ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షానికి ఏలేరు కాలువ పొంగి పొర్లుతోంది. మండలంలోని కాండ్రకోట దబ్బకాలువ గండి కొట్టడంతో కాండ్రకోట, సిరివాడ, గుడివాడ నుంచి పెద్దాపురం వెళ్లే ప్రధాన రహదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జె తిమ్మాపురం, తూర్పుపాకల, కట్టమూరు, కాట్రావులపల్లి గ్రామాల రైతులకు పొలంలోకి వెళ్లేందుకు రాకపోకలక ఇబ్బందులు తలెత్తాయి. మంగళవారం ఉదయానికి వరద ఉధృతి మరింత పెరగడంతో తాటిపర్తి, వడ్లమూరు, చంద్రమాంపల్లి, మర్లావ గ్రామాల గట్లకు గండికొట్టడంతో సుమారు 2300 ఎకరాల నీట మునిగాయి. పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కాండ్రకోట దబ్బ కాలువ రెగ్యులేటర్ వద్ద గేటును ఎత్తితే మర్లావ గ్రామానికి ముంపు తగ్గుతుందని రైతులు ఆర్డీఓ, ఎమ్మెల్యేను కోరారు. ఇదిలా ఉండగా మండల పరిదిలో 23 గ్రామాల్లోను 9542 ఎకరాల వరి పంట ఉండగా వీటిలో చంద్రమాంపల్లి, దివిలి, జి.రాగంపేట, జె తిమ్మాపురం, కాండ్రకోట, కట్టమూరు, మర్లావ, పులిమేరు, తాటిపర్తి, వడ్లమూరు, పెద్దాపురం పట్టణ పరిదిలో 2,625 ఎకరాల్లో వరిచేను నీట మునిగినట్టు వ్యవసాయాధికార్లు ప్రాథమిక అంచనా వేశారు. వరద నీటి వల్ల పెద్దాపురం నుంచి ఏటిపట్టు గ్రామాలకు వెళ్లే రహదారిని అధికారులు భారీకేడ్లతో మూసి వేశారు. ఏటుపట్టు గ్రామాలైన గుడివాడ, సిరివాడ, కాండ్రకోట, మర్లావ మీదుగా ఇతర గ్రామాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి.



రోడ్డుపై పొంగిపొర్లుతున్న వరద నీరు



పంట పొలంల్లోకి చేరిన వరదనీరు

వరద బాధితులకు విరాళాల సేకరణ

పెద్దాపురం: విజయవాడ వరద బాధితులకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దర్గా సెంటర్లో విరాళాలు సేకరించారు. విజయవాడలో సుమారు 4 లక్షల జనాభా సర్వం కోల్పోయారని, కట్టుబట్టలతో రోడ్డుపై పడ్డారని సీఐటీయూ మండల అధ్యక్షులు సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతోపాటు అనేక స్వచ్ఛంద సేవకులు నిత్యం సహాయ సహకారాలు అందిస్తున్నారని వారితోపాటుగా మా సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి క్రాంతి కుమార్, బేబి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో...

కొత్తపల్లి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంగళవారం సీపీఐ (ఎంఎల్) మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కొత్తపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలు, పలు దుకాణాల వద్ద వెళ్లి విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని వరద బాధితులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్రాల అప్పారెడ్డి, చీకట్ల సాంబ శివకుమార్, కాళ్ల నాగేశ్వరరావు, మడికి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ సభ్యులు

ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి

తుని రూరల్: విద్యార్థులు నూతన విద్యా విధానాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత సూచించారు. మండలంలోని వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో మంగళవారం స్టూడెంట్స్ ఇన్‌డక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నియమ నిబంధనలు, క్రమశిక్షణా అంశాలు, ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలు, కళాశాల కార్యాలయ సేవలు, కళాశాల సహాయ సంఘాల కార్యాచరణ, పరీక్షా విధానం, బ్రిడ్జ్ కోర్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, నూతన విద్యా విధానాలు, తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసు, ఐఆర్ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.పుష్పావతి, అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.ఇందిరా ప్రియాంక, అధ్యాపకులు బి.నాగరాజు పాల్గొన్నారు.

వెంటనే జీఓ 85ను రద్దు చేయాలి

సామర్లకోట: జూనియర్ డాక్టర్లకు అన్యాయం జరిగేలా ఉన్న జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు సమ్మెకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పిలుపు మేరకు తమ సమస్యలపై బుధవారం నుంచి పోరాటం చేయనున్నట్టు వైద్యులు తెలియజేశారు. మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారు. జీఓ 85 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో తమ మూడేళ్ల సరీస్సుకు అర్థం లేకుంటా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకస్మాత్తుగా జీఓను మార్చడం అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. గత రెండు నెలలుగా జీఓ 85 రద్దు చేయమని అధికారులకు, ప్రజాప్రతినిధులకు అర్జీలు సమర్పించినప్పటికీ ఎటువంటి సమాధానం రాలేదని నిరాశ వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆందోళన చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్టు ఆ సంఘ నాయకులు తెలిపారు. 11, 12 తేదీల వరకూ చర్చల కోసం ఎదురుచూస్తామని, 13న ప్రభుత్వం నుంచి చర్చలు లేకపోతే పీహెచ్‌సీల్లో అత్యవసర సర్వీసులు మినహాయించి, అన్ని సేవలు నిలిపివేస్తామన్నారు. 14న అత్యవసర సేవలకు మాత్రమే ఉంటాయని, 15న చలో విజయవాడ ర్యాలీ డైరెక్టరు ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద జరుగుతుందని చెప్పారు. 16 నుంచి జీఓ 85 రద్దు చేసే వరకు నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభమవుతుయని వివరించారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని మండలంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల వైద్యాధికారులు కోరారు. రాష్ట్ర పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ పిలుపు మేరకు కొమరగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోమరగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్ధాంతరంగా జీవోను మార్చడం అన్యాయమన్నారు. ఈ జీఓను వెంటనే రద్దు చేయాలని కోరారు. మరో వైద్యాధికారి సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

తొండంగి: మండలంలోని రావికంపాడు, ఏవీ నగరం గ్రామాల్లో మంగళవారం వంట గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన కళాకారులు వీర్నాల కృష్ణ, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారుడు వీర్నాల ప్రకాష్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.